క్లుప్తంగా

హామీలు నెరవేర్చిన సీఎం జగన్



గుడివాడ టౌన్: ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను అన్నారు. బుధవారం స్థానిక చెంచుపేట 19వ వార్డు సచివాలయంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనన్న ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ధనం ప్రజా సంక్షేమానికే వాడాలనేదే ముఖ్యమంత్రి లక్ష్యం అన్నారు. అనంతరం బ్రోచర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ, సచివాలయాల కన్వీనర్ కృష్ణమోహన్, వార్డు కన్వీనర్ పి.శ్రీనివాసు, ఎం.దీవెన, స్వరూపరాణి, రాజాబాబు పాల్గొన్నారు.

35 మద్యం బాటిళ్ల పట్టివేత



తోట్లవల్లూరు: అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను పోలీసులు పట్టుకున్న ఘటన మండలంలోని కుమ్మమూరులో జరిగింది. పమిడిముక్కల సీఐ ఎం. కిషోర్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం అక్రమ రవాణకు పాల్పడుతున్న పెనమకూరు గ్రామానికి చెందిన బోలెం వెంకటేశ్వరరావును అదుపులోకి తీసుకోవటంతో పాటు 35 మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

వేంకటేశ్వర స్వామి ఆదాయం రూ. 9.29 లక్షలు

గుడివాడ టౌన్: స్థానిక జగన్నాథపురం పాటిమీద వేంచేసియున్న వేంకటేశ్వరస్వామి హుండీ కానుకల ఆదాయం రూ. 9,29,158 వచ్చినట్లు ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం తెలిపారు. దేవదాయ శాఖ తనిఖీ అధికారి వి.సుధాకర్ ఆధ్వర్యంలో భక్తబృందం బుధవారం లెక్కించిన ఈ హుండీ కానుకలు గత ఏడాది జూలై ఆరో తేదీ నుంచి ఇప్పటి వరకు వచ్చినవని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు వేదాంతం అప్పలాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

తోట్లవల్లూరులో 31,625 మంది ఓటర్లు

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు మండలంలో మొత్తం 31,625 మంది ఓటర్లు ఉన్నట్లు తహసీల్దార్ ఎం.కుసుమకుమారి తెలిపారు. వీరిలో పురుషులు 15,241, మహిళలు 16,383 మంది ఉన్నారని పేర్కొన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారని తెలిపారు. 13 గ్రామ సచివాలయాలకు సంబంధించి 38 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు కుసుమకుమారి పేర్కొన్నారు.

పల్లెల్లో పాల వెల్లువ

- మహిళా సాధికారతకు పెద్దపీట
- ఫిబ్రవరి 1నుంచి గ్రామాల్లో పాల సేకరణ
- 10 ఆర్బీకేలకు ఏఎంసీయూ మిషన్ల పంపిణీ



మిషన్ల పనితీరుపై డిజిటల్ అసిస్టెంట్, సెక్రటరీలకు శిక్షణ ఇస్తున్న మండల పశువైద్యాధికారి రాంనరేష్

పమిడిముక్కల: పల్లెల్లో జగనన్న పాల వెల్లువకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. మహిళా పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలను ఏర్పాటు చేసింది. ఈ సంఘాల ద్వారా అమూల్ సంస్థ పాలను సేకరించనుంది. ఒక్కో సంఘంలో కార్యదర్శి, సహాయ కార్యదర్శి, 11 మంది సభ్యులను నియమించారు. పాడి రైతుకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం అమూల్‌తో ఒప్పందం చేసుకుంది.

10 ఆర్బీకేల ఎంపిక

జగనన్న పాలవెల్లువకు మండలంలో 10 ఆర్బీకేలను ఎంపిక చేశారు. ఆర్బీకేల్లో ఆటోమేటిక్ మిల్క్ కలెక్షన్ యూనిట్లు ఏర్పాటు చేశారు. 10 కేంద్రాల్లో వెన్న, ఎస్ఎన్ఎఫ్ శాతం పరీక్షించేందుకు రూ.2 లక్షల వ్యయంతో మిషన్లు అందజేశారు. గ్రామాల్లో గ్రామసభలు జరిపి పాలవెల్లువపై రైతులకు అవగాహన కల్పించారు. పాల సేరణపై కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు. ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి గ్రామాల్లో పాల సేకరణ ప్రారంభించనున్నారు.

10 రోజులకోసారి డబ్బుల జమ

మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు మహిళా పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలను ఏర్పాటు చేసి, పాల సేకరణ చేపట్టారు. వెన్న, ఎస్ఎన్ఎఫ్ శాతం ప్రకారం ధర చెల్లిస్తారు. ఒక్కో సెంటర్‌కు 160 లీటర్ల పాలు రావాల్సి ఉంది. ప్రతి 10 రోజులకు ఒకసారి డబ్బులు అకౌంట్‌లో జమ చేస్తారు. గేదెల కొనుగోలుకు కేడీసీసీ బ్యాంకు ద్వారా రుణం ఇప్పిస్తున్నారు.

రైతులను ఒప్పించి పాల సేకరణకు చర్యలు

జగనన్న పాల వెల్లువపై పాడి రైతులకు అవగాహన కల్పించి, పాల సేకరణకు చర్యలు తీసుకుంటున్నాం. మండలంలో ఏడు వేల పాడిగేదెలు ఉన్నాయి. మధ్యవర్తులు, ఏజెంట్లకు కమిషన్ వెళ్లకుండా పాల ఉత్పత్తిదారులకు మెరుగైన ధర అందిస్తాం. మిషన్ ద్వారా వెన్న శాతం నిర్ధారించి ఏ విధమైన తేడా లేకుండా ధర చెల్లిస్తారు. 90 రోజులు పాలు పోసిన వారికి సబ్సిడీపై దాణా అందజేస్తాం.

– రాంనరేష్, మండల పశువైద్యాధికారి

సచివాలయ వ్యవస్థతో గ్రామాల అభివృద్ధి



సింగరాయపాలెంలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్



చేవూరులో సీసీరోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

ఎమ్మెల్యే డీఎన్నార్

ముదినేపల్లి రూరల్: సచివాలయ వ్యవస్థతో గ్రామాల్లో అభివృద్ధి శరవేగంగా జరుగుతున్నట్లు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. మండలంలోని సింగరాయపాలెంలో సచివాలయం, రైతుభరోసా నూతన భవనాలను, చేవూరులో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎన్నార్ మాట్లాడుతూ వందలాది రకాల సేవలను ఎలాంటి వ్యయప్రయాసలు లేకుండా సచివాలయ వ్యవస్థ ప్రజలకు అందిస్తోందన్నారు. ఈ వ్యవస్థ ద్వారా లక్షన్నరమందికి పైగా శాశ్వత ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. అదేవిధంగా రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు పలురకాల సేవలందిస్తున్నట్లు చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతి సచివాలయ పరిధిలో రూ.20 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. దీని ద్వారా నియోజకవర్గంలోని అనేక గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీలు చొప్పర్ల సునీత, రాచూరి రాధా, సర్పంచ్‌లు బోయిన విమలారామరాజు, వల్లభనేని లక్ష్మీ వెంకటరావు, సొసైటీ అధ్యక్షుడు వల్లభనేని సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు మోట్రు ఏసుబాబు, రామకృష్ణ, వెంకటేశ్వరరావు, బత్తిన కిషోర్, గంటా కోటేశ్వరరావు, చిట్టూరి నాంచారాయ్య, రంగిశెట్టి నరసింహారావు, గణేషుల సురేష్, తాడంకి రాజేష్, పేతు రాజా పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ



మందుల కిట్లు పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్, వైఎస్సార్ సీపీ నాయకులు

గుడివాడ టౌన్: ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పం అని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక 19వ వార్డు చెంచుపేట, 29వ వార్డు వడ్డేవారి వీధి సచివాలయాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్–2 వైద్యశిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ఒక్కరూ వైద్య సేవల నిమిత్తం అప్పులపాలు కాకూడదని, ప్రస్తుతం ఆరోగ్యశ్రీకి ఇస్తున్న రూ. 5 లక్షలను రూ. 25 లక్షలకు పెంచారన్నారు. వ్యాధి తీవ్రతను బట్టి ఏ ప్రాంతంలో, ఏ ఆస్పత్రిలో చికిత్స చేసుకున్నా ఈ పథకం వర్తిస్తుందన్నారు. వైద్య శిబిరాల్లో పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమాల్లో వైద్యులు డాక్టర్ కెజియా, డాక్టర్ కృష్ణ గిరీష్, డాక్టర్ లారా, డాక్టర్ గంగరాజు, డాక్టర్ సుష్మ, డాక్టర్ సునైనా, డాక్టర్ కృష్ణకుమార్, డాక్టర్ రమణ, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాసులు, టీపీఓ నాగేంద్రప్రసాద్, ఆర్ఓ విజయ్‌కుమార్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు షేక్ బాజీ, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు వీరిశెట్టి నరసింహరావు, పోలాసి వాసు, వైఎస్సార్ సీపీ నాయకులు టి.రమణకుమార్, ఎ.కృష్ణ మోహన్, పి.శ్రీనివాసు పాల్గొన్నారు.

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ తరగతులు



విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

గుడివాడ టౌన్: పట్టణానికి చెందిన మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఏజీకే మున్సిపల్ హైస్కూల్ 9, 10 తరగతుల విద్యార్థులకు బుధవారం కెరీర్ గైడెన్స్ శిక్షణ తరగతులు నిర్వహించారు. మచిలీపట్నానికి చెందిన డిస్ట్రిక్ట్ మెంటల్ ప్రోగ్రామ్ సైకాలజిస్ట్ డాక్టర్ ఎ.అనంతకుమార్, గుంటూరుకు చెందిన సైకాలజిస్ట్(స్టూడెంట్స్ వింగ్) శ్రీనాథ నైతిక విలువలు, సమాజంలో వాటి అవసరతలు విద్యార్థులకు ఎంత అవసరమో వివరించారు. అనంతరం విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు నిర్వహించి, విజేతలకు నగదు బహుమతులతో పాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సంస్థ జిల్లా అధ్యక్షుడు పి.శేషగిరిరావు, కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ దండమూడి సీతారామస్వామి, గుడివాడ శాఖ అధ్యక్షురాలు దండమూడి జయలక్ష్మి, కార్యదర్శి సరస్వతి, కోశాధికారి గోపిరెడ్డి, సభ్యులు జి.చంద్రశేఖరరావు, ఎం.బ్రహ్మయ్య, బి.రాధాకృష్ణ, ఏజీకే హైస్కూల్ హెచ్‌ఎం లక్ష్మీ నర్సమాంబ పాల్గొన్నారు.

జాతీయ హ్యాండ్ రైటింగ్ పోటీలకు ఉషోదయ విద్యార్థులు



జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, ప్రిన్సిపాల్ రఫీ

జుఝువరం(పామర్రు): జాతీయ స్థాయి హ్యాండ్ రైటింగ్ పోటీలకు తమ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ఉషోదయ హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎండీ రఫీ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధి ఉషోదయ హైస్కూల్లో విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 23న జాతీయ స్థాయి హ్యాండ్ రైటింగ్ దినోత్సవం పురస్కరించుకుని ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని కలెక్టరేట్‌లో జరిగిన పోటీల్లో ఉషోదయ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి 24 మంది జాతీయ స్థాయి హ్యాండ్ రైటింగ్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ప్రశంసా పత్రాలను అందజేసి విద్యార్థులను అభినందించారన్నారు. వీరిలో కొంత మంది అంతర్జాతీయ స్థాయి పోటీలకు హాజరవుతారని ప్రకటించడం ఎంతో అభినందనీయమన్నారు. చిన్నారులను ప్రోత్సహిస్తున్న ఉషోదయ విద్యాసంస్థను కలెక్టర్ అభినందించారని తెలిపారు.

చిత్తడి నేలల పరిరక్షణ అందరి బాధ్యత



ఆటపాక పక్షుల కేంద్రంలో చిత్తడి నేలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులు

కైకలూరు: చిత్తడి నేలల పరిరక్షణ అందరి బాధ్యతగా భావించాలని కైకలూరు మండల ఎంఈఓ–2 వి.శ్రీనివాసరావు చెప్పారు. ఏటా ఫిబ్రవరి రెండో తేదీన అంతర్జాతీయ చిత్తడి నేలల దినోత్సవాన్ని జరుపుకుంటారు. కేంద్ర అటవీ పర్యావరణ మంత్రిత్వ శాఖ చిత్తడి నేలల సంరక్షణ కార్యక్రమాన్ని ఒక సంవత్సరం పాటు నిర్వహించాలని నిర్ణయించింది. చిత్తడి నేలలు – మానవజాతి సంక్షేమం అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్, విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఏలూరు జిల్లాలోని పల్లెర్లమూడి, నూజివీడు మండల పాఠశాలల ఎకో క్లబ్ విద్యార్థులకు ఆటపాక పక్షుల కేంద్రం వద్ద చిత్తడి నేల సంరక్షణపై బుధవారం అవగాహన కలిగించారు. విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఏపీఎన్జీసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ సత్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ జిల్లా సమన్వయకర్త స్వర్ణ వెంకటేశ్వరరావు, క్లస్టర్ కో–ఆర్డినేటర్ మధుసూదన్‌రావు, పాఠశాల ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, స్వర్ణ, రాజ్యశ్రీ పాల్గొన్నారు.

నేడు సచివాలయ భవన ప్రారంభోత్సవం

భట్లపెనుమర్రు(మొవ్వ): మొవ్వ మండలం భట్లపెనుమర్రులో నూతనంగా నిర్మించిన సచివాలయం భవన ప్రారంభోత్సవాన్ని గురువారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ హాజరవుతారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోండి

ఎంపీపీ ఇందిర



భట్లపెనుమర్రు(మొవ్వ): రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలకు, సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతులుగా ఎదగాలని మొవ్వ మండల ఎంపీపీ కొండేటి ఇందిర పేర్కొన్నారు. బుధవారం మొవ్వ మండలం భట్లపెనుమర్రు జెడ్పీ ఉన్నత పాఠశాలలోని 44 మంది ఎనిమిదో తరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ట్యాబ్‌లను ఎంపీపీ అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం చిలుకూరి బాలసుబ్రమణ్యం, విద్యామండలి చైర్మన్ పి.సురేష్, వైఎస్సార్ సీపీ నాయకుడు కొండేటి చందు పాల్గొన్నారు.

సింగరాయపాలెంలో అన్నసమారాధన



ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం బావాజీ మఠంలో కొలువైన కోదండరామాయలం వద్ద బుధవారం రాత్రి అన్నసమారాధన నిర్వహించారు. శ్రీత్యాగరాజస్వామివారి ఆరాధన మహోత్సవాల ముగింపు సందర్భంగా నాయీబ్రాహ్మణ కళాకారుల ఆధ్వర్యంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అన్నసమారాధన ప్రారంభించారు. మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు శీలం రామకృష్ణ, కలిదిండి ఏఎంసీ వైస్ చైర్మన్ బత్తిన కిషోర్, వైఎస్సార్ సీపీ నాయకులు కోమటి విష్ణువర్ధన్, దివి సతీష్, చింతగుంట నాగరాజు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో సత్తాచాటిన పెదముత్తేవి క్రీడాకారులు



ప్రథమ స్థానంలో నిలిచిన పెదముత్తేవి మహిళా జట్టు



గుడివాడలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఆర్డీఓ పద్మావతి

మొవ్వ: పామర్రులోని కంచర్లరామారావు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ వాలీబాల్ పోటీల్లో మొవ్వ మండలం పెదముత్తేవి సచివాలయ క్రీడాకారులు సత్తాచాటారు. మహిళల వాలీబాల్ పోటీలో పెదముత్తేవి జట్టు ప్రథమ స్థానంలో నిలవగా పురుషుల వాలీబాల్ పోటీల్లో పెదముత్తేవి జట్టు ద్వితీయ స్థానంలో నిలిచినట్లు ఫిజికల్ డైరెక్టర్ అప్పికట్ల రామారావు తెలిపారు. మహిళా జట్టుకు కే శాంతి ప్రియ కెప్టెన్‌గా వ్యవహరించగా మహేశ్వరి, నాగ నవ్య, హరిప్రియ, నాగ శివాని, కృష్ణ ప్రియ సభ్యులుగా ఉన్నారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: గుడివాడ నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలను బుధవారం ఆర్డీఓ పి.పద్మావతి ప్రారంభించారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో క్రికెట్ పోటీలను ఆర్డీఓ బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. మొత్తం ఐదు జట్లు ఈ పోటీల్లో గుడివాడ ఎన్టీఆర్ కాలనీ–03 జట్టు గుడ్లవల్లేరు జట్టుపై విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. గురువారం నందివాడ మండలం జనార్దనపురం జట్టుతో ఫైనల్స్ ఆడతారు. ఇక స్థానిక ఎస్‌పీఎస్ హైస్కూల్‌లో జరిగిన ఖో–ఖో పోటీల్లో పురుషుల విభాగం మొదటి విజేతగా గుడివాడకు చెందిన నెహ్రూచౌక్ సెంటర్–02 జట్టు, గుడ్లవల్లేరు మండలం గుడ్లవల్లేరు–01 జట్టు రెండో విజేతగా, పుట్టగుంట జట్టు మూడో విజేతగా నిలిచారు. ఖో–ఖో మహిళల విభాగంలో గుడివాడ నెహ్రూచౌక్ సెంటర్–03 జట్టు మొదటి విజేతగా, గుడ్లవల్లేరు మండలం గుడ్లవల్లేరు–01 జట్టు రెండవ, నందివాడ మండలం పుట్టగుంట జట్టు మూడో విజేతగా నిలిచారు. స్థానిక ఎస్‌పీఎస్ హైస్కూల్లో గురువారం కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, ఎంఈఓలు బాలాజీ, విజయ్ పాల్గొన్నారు.

తక్కెళ్లపాడులో వికసిత భారత్ సంకల్పయాత్ర



పులపర్రులో మాట్లాడుతున్న బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ విష్ణు

మండవల్లి: మండలంలోని తక్కెళ్లపాడు, పులపర్రు గ్రామాల్లో వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ వేంపాటి విష్ణు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బడుగు, బలహీన, అట్టడుగు వర్గాల ఆర్థిక ప్రగతికి పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తక్కెళ్లపాడు సర్పంచ్ చేబ్రోలు సుధారాణి, పులపర్రు సర్పంచ్ వేంద్ర నాగరాజు, బీజేపీ మండల అధ్యక్షుడు సమయం ఏసుబాబు, ప్రధాన కార్యదర్శి నాగసాయి పాల్గొన్నారు.

నేడు సువర్చలా సమేత ఆంజనేయ శాంతి కల్యాణం

కైకలూరు: దేవదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెంలో మద్ది ఆంజనేయస్వామి శాంతి కల్యాణం కైకలూరు శ్యామలాంబ దేవస్థానంలో గురువారం నిర్వహించనున్నట్లు ఈఓ ఆకుల కొండలరావు బుధవారం తెలిపారు. సాయంత్రం నాలుగు నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు కల్యాణం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

యోగా ట్రైనర్ పోస్ట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం గూడవల్లిలోని ప్రభుత్వ ఆయుర్వేద హాస్పిటల్‌లో కాంట్రాక్ట్ పద్ధతిన యోగా శిక్షకుడు పోస్ట్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వైద్యాధికారి పి.మల్లికార్జునరావు తెలిపారు. యోగా శిక్షణలో అనుభవం ఉన్న పురుష అభ్యర్థి అర్హుడన్నారు. నెలకు రూ.8 వేల గౌరవ వేతనం ఇస్తామని, ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 98496 54641లో సంప్రదించాలని సూచించారు.

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియపై శిక్షణ

మండవల్లి: మండలంలోని పేదలకు ఇచ్చిన జగనన్న కాలనీల్లో స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియపై సబ్ రిజిస్ట్రార్ నందీశ్వరరావు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్నాలలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పేదవానికి సొంతిల్లు ఉండాలనే ఆశయంతో స్థలాలు కేటాయించి, ఇళ్ల నిర్మాణానికి సొమ్ము అందజేస్తున్నట్లు తెలిపారు. జగనన్న కాలనీల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ త్వరితగతిన పూర్తయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఓటు వజ్రాయుధం

నేడు జాతీయ ఓటరు దినోత్సవం

కలిదిండి: ఉత్తమ పాలకులను ఎన్నుకునే హక్కు ప్రజల చేతుల్లోనే ఉంటుంది. కేవలం ఓటు అనే వజ్రాయుధంతోనే అది సాధ్యం. అందరూ ఓటు హక్కును వినియోగించుకున్నప్పుడే దానికి సార్థకత లభిస్తుంది.

18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవచ్చే. అందుకే ఓటును దుర్వినియోగం చేయకుండా దానికి ఉన్న ప్రాధాన్యతను వివరిస్తూ ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

ఓటరు దినోత్సవం ఏర్పాటు

రాజకీయ ప్రక్రియలో యువకులు భాగస్వాములయ్యేందుకు వీలుగా ఏటా జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం 2011లో నిర్ణయించింది. ప్రతి ఏటా పేర్లు నమోదుచేసుకున్న ఓటర్లకు జనవరి 25 నాటికి ఫొటో గుర్తింపు కార్డులు ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందించారు. అప్పటి నుంచి ఏటా జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఓటరు దినోత్సవం సందర్భంగా కలిదిండి మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో గురవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేయనున్నట్లు తహసీల్దార్ డి.వంశీ తెలిపారు.

ఓటరే రారాజు



ప్రజాస్వామ్యంలో ఎన్నికల రోజున ఓటరే దేశానికే రారాజు. అటువంటి రాజుగా భావించబడుతున్న ఓటరు ఐదేళ్లపాటు ప్రజాప్రతినిధిగా పనిచేసే వ్యక్తిని జాగ్రత్తగా ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఓటును అమ్ముకోవద్దు. ప్రజాస్వామ్యాన్ని బతికించండి.

– దశక వంశీ, తహసీల్దార్, కలిదిండి